
సాక్షి పల్నాడు

బుధవారం ၊ 19 ၊ ఫిబ్రవరి ၊ 2025



## పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ తనిఖీలు

కారెంపూడి: 27న జరగనున్న పట్టభద్రుల ఎన్నికకు కారెంపూడిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు మంగళవారం తనిఖీ చేశారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 536.90 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 10,000 క్యూసెక్కులు విడుదలవుతోంది.




## 'ఫేస్ వాష్ అండ్ గో'

నరసరావుపేట: ఫేస్‌వాష్ అండ్ గో కార్యక్రమం జిల్లాలో కొనసాగుతోంది. మంగళవారం రాత్రి పలువురు డ్రైవర్లకు నీళ్లు ఇచ్చి పోలీసులు ముఖం కడిగించారు.

# రైతు కళ్లు చెమిర్చి..



- దారుణంగా పతనమైన ధరలు
- గతేడాది క్వింటా మిర్చి ధర రూ.20 వేలు - రూ.24 వేలు
- ప్రస్తుతం రూ.10 వేలు కూడా దక్కని వైనం
- పెరిగిన చీడపీడలు.. తగ్గిన దిగుబడి
- భారీగా నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని ప్రభుత్వం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతన్నలు
- నేడు గుంటూరు మిర్చి యార్డులో వైఎస్ జగన్ పర్యటన

సాక్షి, నరసరావుపేట: ఎర్ర బంగారంగా పిలిచే మిర్చి సాగుతో లాభాల పంట పండుతుందని సాగుచేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతేడాది మిర్చి రైతులకు మంచి దిగుబడులు రావడంతోపాటు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలవడంతో అధిక ధరలు లభించడంతో లాభాలు తెచ్చిపెట్టింది. దీంతో ఆశగా ఈ ఏడాది మిర్చి సాగుచేసిన రైతులకు ఓవైపు ప్రకృతి మరోవైపు ప్రభుత్వం సహకరించకపోవడంతో తీవ్ర సంక్షోభంలోకి వెళ్లారు. లాభాల మాట దేవుడెరుగు కనీసం పెట్టిన పెట్టుబడైనా వస్తే చాలని రైతులు కోరుకుంటుండగా, పరిస్థితి మాత్రం కనీసం కూలీలకు అయిన ఖర్చు కూడా రాని దుస్థితి నెలకొంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఈ దశలో ప్రభుత్వమైనా అండగా నిలిచి మద్దతు ధర లభించేలా చూస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. తీవ్ర నిరాశలో ఉన్న మిర్చి రైతులకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు గుంటూరు మిర్చి యార్డుకు రానున్నారు. రైతన్నల తరఫున ప్రభుత్వానికి వారు పడుతున్న కష్టాలను వివరించి, న్యాయం చేసేలా ఒత్తిడి చేయనున్నారు.

### మిర్చి రైతుకు ప్రభుత్వ 'మద్దతు' శూన్యం

పెట్టుబడి కూడా రాని దుస్థితి...

పల్నాడు జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 40,127 హెక్టార్లలో, రబీలో మరో 3,082 హెక్టార్లలో మిర్చి పంట సాగుచేశారు. ఇందులో ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు కోతలకు వచ్చాయి. మిగిలిన పంటలతో పోల్చితే మిర్చి పంటకు పెట్టుబడి అధికం. అయితే దిగుబడి, ధర మంచిగా ఉంటే అధిక లాభాలు వస్తాయన్న ఆశతో రైతులు అప్పులు చేసి మరీ సాగు చేస్తారు. గతంతో పోల్చితే రైతులు అవసరం లేకపోయినా ఎరువులు, పిచికారీ మందుల వాడకం అధికమైంది. దీంతో ఎకరా మిర్చి పంటకు రూ.లక్ష నుంచి రూ. లక్షన్నర వరకు పెట్టుబడి అవుతోంది. కౌలు రైతులయితే భూమి కౌలు మరో రూ.20–30 వేలు అధికంగా ఖర్చు కానుంది.



సాగులో ఉన్న మిరప పైరు

### పట్టించుకోని ప్రభుత్వం

మిర్చి పంటకు ఖరీఫ్ సాగులో ఉన్నట్టుండి బొబ్బర తెగులు రావడంతో మొక్క ఎదుగుదల ఆగిపోయింది. ఇప్పటికే ఉన్న పూత, పిందె అర్ధంతరంగా రాలిపోయింది. దిగుబడి సాధారణంగా 30 క్వింటాళ్ల వరకు ఉండగా బొబ్బర వచ్చిన తోటల్లో 10 క్వింటాళ్లు సైతం కష్టమని రైతులు భావిస్తున్నారు. గతంలో మిర్చి ధరలు రూ.22 వేల నుంచి రూ.24 వేల వరకు ఉండగా ప్రస్తుతం రూ.10వేలు నుంచి రూ.12 వేలు మాత్రమే ఉంది. దీంతో పండిన అరకొర మిర్చిని కూలీలతో తీసి విక్రయిస్తే కనీసం కూలి, రవాణా ఖర్చులు సైతం రావని రైతులు అభిప్రాయపడుతున్నారు. దీంతో కొంతమంది రైతులు పంటలను వదిలేస్తున్నారు. మిర్చి ధర గతేడాదితో పోల్చితే క్వింటాకు ఏకంగా రూ.8 వేల నుంచి రూ.6 వేల వరకు తగ్గిపోయినా ప్రభుత్వం నుంచి ఏమాత్రం స్పందన రావడంలేదు. రైతులకు మద్దతు ధర లభించేలా కూటమి సర్కారు నుంచి ఎటువంటి చర్యలు లేవు.

### ఆత్మహత్యే శరణ్యం



మిర్చికి ఇదే విధంగా ధర ఉంటే రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతారు. గత ఏడాది రూ.20వేలు పలికిన ధర ఈ ఏడాది రూ.13 వేలు కూడా రావడం లేదు. దిగుబడులు కూడా ఎకరాకు 10–15 క్వింటాళ్లు మించి వచ్చేలా కనిపించడం లేదు. నల్లి తెగులు నివారణ కోసం అధికంగా ఖర్చు చేయాల్సి వచ్చింది. ఏ రకంగా చూసుకున్నా రైతులు ఆర్థికంగా నష్టాలు తప్పేలా లేవు. గత ఏడాది ఉన్న ధర కల్పిస్తే రైతులు కొంత వరకు నష్టాల నుంచి బయటపడతారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయాలి. లేకుంటే ఆత్మహత్యలే శరణ్యం

–నాగేశ్వరరావు, దుర్గి, మాచర్ల నియోజకవర్గం

### మిర్చి రైతులు తీవ్ర కష్టాల్లో ఉన్నారు



ఈ ఏడాది మిర్చి రైతులకు అన్ని విధాలుగా దెబ్బలు తగులుతున్నాయి. నల్లి తెగులు కారణంగా పంట దిగుబడులు సగానికి తగ్గి, పెట్టుబడులు పెరిగాయి. పండిన పంటకైనా మంచి ధర ఉంటుందంటే అది కూడా క్వింటాకు రూ.7వేలు నుంచి రూ.10వేలు వరకు తగ్గిపోయింది. దీంతో మిర్చి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.

– జి.వెంచయ్య, రైతు, గోనెపూడి, నరసరావుపేట రూరల్ మండలం

### కూలి ఖర్చులు కూడా రావడం లేదు



నేను రెండు ఎకరాల్లో మిరప పంట సాగు చేశాను. మొదటి కోత కోస్తే ఆరు క్వింటాళ్లు వచ్చింది. 170 మంది కూలీలు కోతకు పని చేశారు. వీరికి కూలి రూ.400 చొప్పున రూ.68 వేలు అయింది. మిర్చి క్వింటాకు రూ.10వేలు చొప్పున విక్రయిస్తే ఆరు క్వింటాళ్లకు రూ.60వేలు వచ్చింది. పంటకు పెట్టిన పెట్టుబడుల సంగతి దేవుడెరుగు కనీసం మొదటి కోతకు కూలీల ఖర్చే రూ.8 వేలు చేతి నుంచి పడిందంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవాలి.

–బి.శివరామయ్య, రైతు, గోనెపూడి, నరసరావుపేట రూరల్ మండలం

### ఎకరానికి రూ.లక్ష నష్టం వచ్చేలా ఉంది



నేను ఎకరం పొలంలో మిరప సాగు చేశాను. ఇప్పటి వరకు రూ.లక్షకు పైగా ఖర్చు చేశాను. మొదటి కోతకు పంట సిద్ధంగా ఉంది. ధర లేకపోవడం, కూలి ఖర్చులు పెరిగిపోవడంతో గిట్టుబాటు కాదనే భావనతో పంట కోయడానికి ఆలోచించాల్సి వస్తుంది. ఒక్కో ఎకరానికి రూ.లక్షకు పైగా నష్టం తప్పేలా లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా మిర్చి రైతులు దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

– మాకాని శ్రీను, రైతు, గోనెపూడి, నరసరావుపేట రూరల్

## న్యూస్‌రీల్

### అమరేశ్వరుని సేవలో క్యాట్ న్యాయమూర్తి



అమరావతి: ప్రముఖ శైవ క్షేత్రం అమరావతిలో వేంచేసియున్న శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరుని మంగళవారం సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(క్యాట్) న్యాయమూర్తి లతా భరద్వాజ్ దర్శించుకున్నారు. తొలుత ఆలయ అధికారులు, అర్చకులు న్యాయమూర్తికి స్వాగతం పలికారు. అమరేశ్వరునికి, బాలచాముండేశ్వరీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి స్వామివారి శేషవస్త్రంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట క్యాట్ మెంబర్ వరణ్‌సింధు కౌముది, అధికారులు ఉన్నారు.

### చింతపల్లి మేజర్‌కు సాగునీరు విడుదల



అచ్చంపేట: మండలంలోని కొండూరు పంచాయతీ పరిధిలోని శ్రీనివాసతండా వద్ద నాగార్జున సాగర్ కాలువల ద్వారా చింతపల్లి మేజర్‌కు సాగునీటి అవసరాలకు కెనాన్స్ ఏఈ చిల్కా భాస్కర్ ఆదేశాలతో మంగళవారం సాగునీటిని వదిలారు. చింతపల్లి మేజర్ కాలువ కింద ప్రస్తుతం మిర్చి, మొక్కజొన్న, పొగాకు తదితర పంటలు వేశారు. ఈ కాలువకు నీళ్లు రాకపోవడంతో రైతులు గత కొద్దికాలంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇక్కడ నుంచే కస్తల మేజర్‌కు సాగునీటిని వదిలిన అధికారులు చింతపల్లి మేజర్‌కు వదలకపోవడంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు శ్రీనివాసతండా నుంచి ఐదు రోజులు కస్తల మేజర్‌కు, ఐదు రోజులు కస్తల మేజర్‌కు సాగునీటిని మార్చి మార్చి వదిలే విధంగా ఆదేశాలు జారీ చేశారు.

### న్యాయ సేవాధికార సంస్థ సభ్యులకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేటటౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ సభ్యుల నియామకానికి ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ మంగళవారం తెలిపారు. రాష్ట్రంలోని 138 మండల న్యాయ సేవాధికార సంస్థలలో సభ్యులుగా వ్యవహరించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు. అనుభవజ్ఞులైన సీనియర్ న్యాయవాదులు, సామాజిక సేవా కార్యకర్తలు, న్యాయ సేవలు ప్రజలకు అందించటంలో ఆసక్తిగల వారు ఈ నెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### కాలువలో కారు బోల్తా



అమర్తలూరు(వేమూరు): ఇంటూరు కాల్వలో కారు బోల్తా పడిన ఘటన మంగళవారం జరిగింది. అమర్తలూరు పోలీసుల కథనం మేరకు గుంటూరు జిల్లా పొన్నూరుకు చెందిన నలుగురు కుటుంబ సభ్యులు బాపట్ల జిల్లా రేపల్లెలో జరిగే శుభ కార్యక్రమానికి వెళ్లేందుకు కారులో బయలుదేరారు. ఈక్రమంలో ఉదయం 6.30 నిమిషాలకు ఇంటూరు నుంచి చెరుకుపల్లి వెళ్లే దారిలో లారీని క్రాస్ చేస్తుండగా అదుపు తప్పి కారు ఇంటూరు కాల్వలో పడింది. అందులోఉన్న వారికి స్వల్ప గాయాలు కావడంతో చెరుకుపల్లిలో ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొంది, రేపల్లె వెళ్లినట్లు ఎస్ఐ జానకి అమర్ వర్ధన్ తెలిపారు.

### చిన్నతరహా నీటి వనరుల గణనకు సిద్ధం కండి



నరసరావుపేట: జిల్లాలో గ్రామస్థాయిలో చిన్ననీటి వనరులు, రెండో జలాశయాల గణన నిర్వహించాలని రాష్ట్ర అర్థ గణాంకశాఖ విజయవాడ ఉపసంచాలకులు పి.శ్రీనివాస్, ఉప గణాంక అధికారి జి.రమేష్‌కుమార్ సంబంధిత అధికారులను కోరారు. మంగళవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో చిన్న తరహా నీటి వనరుల గణన కార్యాచరణలో భాగంగా సంబంధిత అధికారులకు నిర్వహించిన శిక్షణలో వారు అధికారులు పాల్గొన్నారు. ఇన్‌చార్జి జిల్లా గణాంక అధికారి పి.మాలతీదేవి, ఉప గణాంక అధికారి ఎం.కృష్ణకిషోర్, టి.సూర్యకుమారి పాల్గొన్నారు.

# పకడ్బందీగా పది పరీక్షలు

### జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లాలోని విద్యాశాఖాధికారులు సంబంధిత తహసీల్దార్ల సహకారంతో పదోతరగతి పరీక్షలు సజావుగా, పారదర్శకతతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మార్చి 17వ తేదీ నుంచి నిర్వహించనున్న పదోతరగతి పరీక్షలపై అధికారులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 463 పాఠశాలల నుంచి రెగ్యులర్, ప్రైవేటు పాఠశాలల్లోని మొత్తం 26,497మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారన్నారు. వీరంతా జిల్లాలోని 128 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షలకు హాజరవుతారన్నారు. దీనికి సంబంధించి 128 మంది చీఫ్ సూపరింటెండెంట్, మరో 128 మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్, ముగ్గురు అదనపు డిపార్టుమెంటల్ ఆఫీసర్లకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి ఏప్రిల్ 1 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45వరకు జరుగుతాయన్నారు. అధికారులు వారి పరిధిలోని వసతులను పరీక్షించాలని ఆదేశించారు. పాఠశాల విద్య ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి, జిల్లా ప్రభుత్వ పరీక్షల పరిశీలకులుగా నియమితులైన జాయింట్ డైరెక్టర్ ఎస్.గీత, డీఈఓ ఎల్.చంద్రకళ, ఎగ్జామ్స్ అసిస్టెంట్ కమిషనర్ కేఎంఏ హుస్సేన్, డీసీబీ సెక్రటరీ, సత్తెనపల్లి, నరసరావుపేట డివిజన్ల ఉప విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

# నేడు గుంటూరుకు వైఎస్ జగన్

పట్నంబజారు (గుంటూరుఈస్ట్) : వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం గుంటూరు మిర్చియార్డుకు వస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు చెప్పారు. గుంటూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్చి రైతులకు సంబంధించి గిట్టుబాటు ధర కల్పించలేని పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టడంతో పాటు, రైతులకు భరోసా కల్పించేందుకు వైఎస్ జగన్ వస్తున్నారని వివరించారు. రైతులకు అండగా తానున్నాననే భరోసా ఇవ్వనున్నట్టు వెల్లడించారు. మిర్చియార్డుకు వైఎస్ జగన్ ఉదయం 9.30లకు చేరుకుంటారని, మిర్చిని అమ్ముకునేందుకు వచ్చిన రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటారని వివరించారు.

**కూటమి ప్రభుత్వం విఫలం**

కూటమి ప్రభుత్వం వచ్చిన తొమ్మిది నెలల కాలంలో సీఎం చంద్రబాబు రైతులకు ఒక్క మేలు అయినా చేశారా అని అంబటి ప్రశ్నించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో బాబు విఫలమయ్యారని విమర్శించారు. ధాన్యం బస్తా ధర రూ.1200 నుంచి 1300, మిర్చి క్వింటా ధర రూ. 13వేలు కంటే పలకడం లేదని ధ్వజమెత్తారు.

# సీఐడీకి చిట్‌ఫండ్ స్కాం కేసు

నరసరావుపేట టౌన్: నరసరావుపేటలోని సాయి సాధన చిట్‌ఫండ్ స్కాం కేసు సీఐడీకి బదిలీచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో కేసును సీఐడీకి బదిలీ చేయొద్దంటూ బాధితులు చేసిన ఆందోళనలు, విన్నపాలు వృథా అయ్యాయి. వివరాల్లోకి వెళితే.. సాయిసాధన చిట్‌ఫండ్ పేరుతో పాలడుగు పుల్లారావు నరసరావుపేటలోని పల్నాడు రోడ్డులో కార్యాలయాన్ని నిర్వహించాడు. చీటీ పాటలు, డిపాజిట్ల పేరుతో సుమారు రూ.400 కోట్ల వరకు పోగేసుకొని చివరకు కుటుంబంతో సహా 20 రోజుల క్రితం ఉడాయించాడు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో నరసరావుపేట, గుంటూరుల్లో పుల్లారావుపై చీటింగ్ కేసులు నమోదయ్యాయి. నిందితుడు కోర్టులో లొంగిపోయి ప్రస్తుతం గుంటూరు సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్బారెడ్డి తన వద్ద రూ.2.70 కోట్లు డిపాజిట్ల రూపంలో తీసుకొని మోసం చేశాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు నరసరావుపేట వన్‌టౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. బాధితులు అంతా ఒక్కొక్కరుగా వచ్చి చీటీ పాటలు, డిపాజిట్ల రూపంలో చెల్లించిన రూ.కోట్లకు సంబంధించిన రశీదు, బాండులను పోలీసులకు అప్పగించారు. వారందరినీ కేసులో బాధితుల జాబితాలో చేర్చారు. ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు తెలంగాణ, విదేశాల్లో సైతం పుల్లారావు బాధితులు ఉన్నారు. చీటీ పాటలకు సంబంధించి 600 మంది సభ్యులు, డిపాజిట్లకు సంబంధించి మరో 400 మంది బాధితులు ఉన్నట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

**గగ్గోలు పెట్టినా లాభం లేదు..!**

నిందితుడు పుల్లారావు అధికారపార్టీకి చెందిన వ్యక్తి కావడంతో పోలీసులు సత్వరం స్పందించి న్యాయం చేయలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. కేసు సీఐడీకి బదిలీ చేస్తే న్యాయం జరగడంలో ఆలస్యమవుతుందని, బదిలీ చేయకుండా స్థానిక పోలీసుల చేతే దర్యాప్తు చేయించాలని స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు ఇంచార్జి మంత్రిని పలు మార్లు బాధితులు కలసి కోరారు. వివిధ మార్గాల ద్వారా ప్రభుత్వానికి సైతం ఇదే విన్నపాన్ని తెలియజేశారు. పుల్లారావు కుటుంబం, బినామీల పేర్ల మీద ఉన్న ఆస్తులు, నగదు లెక్కల తేల్చి బాధితులకు పంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే పుల్లారావు కొల్లగొట్టిన నగదు, బాధితుల సంఖ్య భారీస్థాయిలో ఉండటంతో కేసు తీవ్రత దృష్ట్యా సీఐడీకి బదిలీ చేసినట్టు పోలీసు అధికారులు చెప్పుకొస్తున్నారు. ఈ విషయంపై డీఎస్పీ కె.నాగేశ్వరరావును వివరణకోరగా సీఐడీకి కేసు బదిలీ అయిన విషయం వాస్తవమేనన్నారు.



సాయిసాధన చిట్‌ఫండ్ కార్యాలయం

### బాధితులకు పుల్లారావు ఝలక్

నరసరావుపేటటౌన్: రాజీమార్గం ద్వారా సమస్యను పరిష్కరించుకొందామనుకున్న బాధితులకు సాయి సాధన చిట్‌ఫండ్ నిర్వాహకుడు పాలడగు పుల్లారావు ఝలక్ ఇచ్చాడు. తనను కలిసేందుకు జైలుకు వెళ్లిన బాధిత సంఘ ప్రతినిధుల ములాకత్‌ను తిరస్కరించాడు. దీంతో పుల్లారావు మోసపూరిత నైజం మరోమారు బయటపడినట్లు అయ్యింది. గుంటూరు సబ్ జైల్లో ఉన్న పుల్లారావు గత 20 రోజులుగా తన తరఫున పెద్దల ద్వారా అప్పులకు సమానంగా ఆస్తులు ఉన్నాయని బాధితులను మభ్యపెడుతూ వచ్చారు. చివరకు చర్చల ద్వారా రాజీ చేసుకొని సమస్య పరిష్కరించుకుందామని కోరారు. దీంతో బాధితులంతా తమ సమస్య పరిష్కారం కాబోతుందని ఆనంద పడ్డారు. బాధితులంతా కలిపి ఐదుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకొన్నారు. సభ్యులు ఈ విషయంపై సోమవారం పుల్లారావుతో చర్చించేందుకు సబ్‌జైల్‌కు వెళ్లారు. అయితే వారిని కలిసేందుకు పుల్లారావు నిరాకరించాడు. దీంతో గంటల పాటు వేచి ఉన్న కమిటీ ప్రతినిధులు వెనుదిరిగారు. మంగళవారం బాధితులంతా పట్టణంలోని ఓ హోటల్‌లో సమావేశం అయ్యారు. రాజీకని పెద్దమనుషులను పంపి చివరకు పుల్లారావు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని బాధితులంతా రోడ్డెక్కి ఆందోళనలు ఉధృతం చేయాలని సమావేశంలో నిర్ణయించుకున్నారు. మంత్రి లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందేజేసేలా కార్యాచరణ రూపొందించుకున్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర సచివాలయం వద్ద ఆందోళన చేయాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చేకూరి సాంబశివరావు, యామని రామారావు, కడియాల రమేష్, ఐనవోలు రాధ, శరత్, ప్రతాప్ పాల్గొన్నారు.

# వేసవిలోనూ కొనసాగు

- ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ విధానంతో నేలకు, పైరుకు మేలు
- 30 రకాల విత్తనాలతో వైవిధ్య సాగు
- రబీ – ఖరీఫ్ సీజన్ల నడుమ సాగుకు సిద్ధం చేస్తున్న ప్రకృతి వ్యవసాయం అధికారులు

యడ్లపాడు: పీఎండీఎస్(ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్) విధానాన్ని జిల్లాలో ప్రకృతి వ్యవసాయ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. రబీ ముగింపు నుంచి ఖరీఫ్ ప్రారంభం మధ్య కాలంలో ఈ విధానాన్ని అనుసరించి వివిధ రకాల విత్తనాలతో పంటలను సాగు చేస్తారు. ఖరీఫ్, రబీ కాలాల్లోనే కాకుండా ఆ మధ్యలో వచ్చే వేసవిలో పొలాలు ఖాళీగా ఉంచకుండా సాగు చేయడంతో భూమి 365 రోజులు కప్పబడి ఉంటుంది. ఇది నేల నాణ్యతను మెరుగుపరిచే ప్రధాన విధానం. పల్నాడు జిల్లాలో ఈ ఏడాది ఈ విధానం ద్వారా 80 వేల ఎకరాల్లో పంట సాగే లక్ష్యంగా ప్రకృతి అధికారులు కృషి చేస్తున్నారు.



ఫిరంగిపురంలో పీఎండీఎస్ విధానంతో సాగవుతున్న కొత్తిమీర పైరు

**నీటి నిల్వ సామర్థ్యం పెంపు..**

ఇది తొలుత నవధాన్యాలైన 9 రకాల విత్తనాలతో ప్రారంభించారు. మంచి ఫలితాలు రావడంతో 18 రకాలుగా పెంచారు. ప్రస్తుతం 30 రకాల విత్తనాలను కలిపి పీఎండీఎస్ సాగు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ విధానంతో భూమిలో సూక్ష్మజీవులు వద్ధి చెందుతాయి. నేల నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. ప్రధానంగా నేలలో కర్బనశాతం మెండవుతుంది. ఇది చీడపీడలను, వాతావరణ మార్పులను తట్టుకునే శక్తిని పెంచుతుంది.

**పీఎండీఎస్ కిట్ ఇదీ**

పీఎండీఎస్ విధానంలో పప్పుజాతి, నూనెజాతి, ధాన్యపు జాతి, సుగంధ ద్రవ్యాలు, పచ్చిరొట్ట, ఆకు కూరలు, కూరగాయ రకాలైన తీగజాతి, దుంపజాతి వంటి 30 రకాల విత్తనాలను కలిపి ఒక కిట్‌గా తయారు చేస్తారు. ఈ కిట్‌ను ఎకరాకు విత్తుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందులో బొబ్బర్లు, చిక్కుడు, మినుము, పెసర, నువ్వులు, ఆముదం, వేరుశెనగ, ధనియాలు, మెంతులు, రాగులు, మొక్కజొన్న, సామలు, కొర్రలు, జీలుగ, పిల్లిపెసర వంటి పలు రకాల విత్తనాలు ఉంటాయి.

**విత్తన సంరక్షణ**

వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నా వర్షాలు కురవకపోయినా పీఎండీఎస్ విధానంలో విత్తనాలను సంరక్షించుకోవచ్చు. విత్తనాలను బీజామృతం, బంకమన్ను, ఘనజీవామృతం, బూడిదతో మూడు రకాల కోటింగ్ చేయాలి. ఇది చీడపీడల నుంచి రక్షణ కల్పిస్తుంది. ఎలుకలు, ఇతర చీడపీడల నుంచి రక్షణ లభిస్తుంది. చిన్నపాటి వర్షం వచ్చినా ఈ విత్తనాలు మొలకెత్తుతాయి.

### అధిక దిగుబడులు...

ఆరేళ్లగా ప్రకృతి విధానంలో పది ఎకరాల్లో అన్ని రకాల పంటల్ని సాగు చేస్తున్నాను. ఏటా పీఎండీఎస్ విధిగా చేయడంతో పంట నాణ్యత, దిగుబడి పెరిగాయి. మిర్చి కేజీ రూ.600 విక్రయించిన సందర్భాలు ఉన్నాయి.

– డి.శేషారావు, రైతు, పెదకూరపాడు

### పీఎండీఎస్ వల్ల లాభాలు

- నేల గుల్లబారటం వల్ల సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి
- నీటి నిల్వ సామర్థ్యం మెరుగవుతుంది
- ప్రధానంగా నేలలో కర్బన శాతం పెరుగుదల
- ఫలితంగా పంటకు చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాల్ని తట్టుకునే శక్తి సామర్థ్యం
- నేల ఉత్పాదక శక్తి లభించి అధిక దిగుబడులు సాధన
- పీఎండీఎస్ పంట పశువుల పచ్చిమేతకు వాడుకోవచ్చు
- తద్వారా పాడిఖర్చు తగ్గించుకోవచ్చు
- పిల్లిపెసర తదితర వాటిని అమ్మి అదనపు ఆదాయం పొందవచ్చు

### అనేక లాభాలు



రానున్న ఖరీఫ్‌లో ప్రధాన పంటలు సాగు చేసే రైతులు, రబీ సీజన్ పూర్తి చేసుకున్న రైతులు తమ పొలాల్ని ఖాళీ ఉంచకుండా పీఎండీఎస్‌కు సిద్ధంకండి. ఈ సాగు వల్ల ప్రధాన పంటలకు మేలు జరుగుతుంది. జిల్లాలో ఈఏడాది 80వేల ఎకరాల సాగు లక్ష్యం చేసుకున్నాం.

– కె.అమలకుమారి, డీపీఎం, ప్రకృతి విభాగం పల్నాడు

## క్లుప్తంగా

### హైవేలో ప్రమాద స్థలాల పరిశీలన



**రొంపిచర్ల:** పల్నాడు జిల్లాలోని శ్రీ కాసుబ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేపై జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ప్రత్యేక బృందం మంగళవారం పర్యటించింది. దాచేపల్లి టోల్‌గేట్ వద్ద నుంచి సంతమాగులూరు అడ్డరోడ్డు వరకు ఉన్న రాష్ట్ర రహదారిలోని ప్రమాద స్థలాలను బృందం పరిశీలించింది. ఎక్కువ ప్రమాదాలు జరిగిన ప్రత్యేక ప్రాంతాలను పరిశీలించి, ప్రమాదాలకు గల కారణాలను వారు పరిశీలించారు. అలాగే ఆ ప్రాంతంలో ఉన్న వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ బృందంలో రొంపిచర్ల ఎస్ఐ మణికృష్ణతో పాటు ఎంఐఈ అధికారులు, హైవే అధికారులు, జిల్లా ఎస్పీ నియమించిన ప్రత్యేక పోలీస్ బృందం అధికారులు ఉన్నారు.

### గురుకుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**చుండూరు(వేమూరు):** డాక్టర్ బి. ఆర్. అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలలో 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రవేశానికి పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. మార్చి 6వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పరీక్షలు ఏప్రిల్ 6వ తేదీన ఉంటాయని తెలిపారు. మార్కుల శాతం, రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారని తెలిపారు.

### జోరుగా పొట్టేళ్ల పందేలు



**మేదరమెట్ల:** కొరిశపాడు మండలంలోని పలు గ్రామాల్లో నిషేధిత కోడి పందేలు, పొట్టేళ్ల పోటీలు జోరుగా సాగుతున్నాయి. తమ్మవరంలో మంగళవారం పొట్టేళ్ల పందేలు నిర్వహించారు. నెల్లూరు, భీమవరం నుంచి తెప్పించిన పొట్టేళ్లతో స్థానిక నాయకులు బరులు ఏర్పాటు చేశారు. భారీ మొత్తంలో పందేలు వేశారు. పోలీసులు సైతం కన్నెత్తి కూడా చూడలేదు. యర్రబాలెం, అనమనమూరు తమ్మవరం గ్రామాల్లో నిత్యం కోడి పందేలు జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంతో స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా వీటిని అరికట్టాలని కోరుతున్నారు.

# ఇంజినీ'రింగ్ రింగ'

- మత్తు పదార్థాలు విక్రయిస్తూ పట్టుబడిన విద్యార్థులు
- 9 మంది అరెస్టు, పరారీలో ఇద్దరు
- బెంగళూరు నుంచి తక్కువ రేటుకు దిగుమతి
- గుంటూరులో అధిక ధరకు అమ్మకాలు
- వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీ డాక్టర్ కె శ్రీనివాసులు

**నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్):** ఇంజినీరింగ్ విద్యార్థులు రింగరింగ అంటూ మత్తులో మునిగితేలుతున్నారు. నిషేధిత మత్తు పదార్థాలను కలిగి ఉండడంతోపాటు వాటిని తక్కువ ధరకు కొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నాలుగేళ్లుగా గుంటూరులో సాగుతున్న ఈ మత్తు దందాను ఎక్సైజ్ శాఖ అధికారులు తాజాగా రట్టు చేశారు. ఎక్సైజ్ శాఖ డెప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు మంగళవారం ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. మంగళగిరి రూరల్ మండలం కాజకు చెందిన ఎం.సాయి కృష్ణ గుంటూరు సమీపంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఇతని సోదరుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంటాడు. సోదరుడి దగ్గరకు సాయి కృష్ణ వెళ్లిన సమయంలో అదే రూంలో ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, తెనాలి చినరావూరుకు చెందిన ధరావత్ సతీష్‌కుమార్ పరిచయమయ్యాడు. సతీష్‌కుమార్‌కు బెంగళూరుకు చెందిన నితిన్‌తో కలిసి ఎండీఎంఏ మత్తుమందును సేవించేవాడు. దీనిని సాయికృష్ణ కూడా అలవాటు చేసుకున్నాడు. ఈ మత్తుమందును గుంటూరులోనూ అమ్ముకోవచ్చని, లాభాలు పొందొచ్చని సతీష్‌కుమార్, నితిన్ సాయికృష్ణకు సూచించారు. దీంతో నితిన్ ద్వారా ఎండీఎంఏ మత్తు మందును నాలుగేళ్లుగా సాయి కృష్ణ, సతీష్ కుమార్ ఇద్దరూ గుంటూరు తీసుకొచ్చి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు అమ్ముతున్నారు. సాయి కృష్ణ ఇటీవల గుంటూరు సమీపంలోని గోరంట్ల ప్రాంతంలో కోదండ రామా నగర్ లోని సాయి లక్ష్మీ అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకొని అక్కడి నుంచే దందా నిర్వహిస్తున్నాడు.

#### గుట్టురట్టు ఇలా..

రెండు రోజుల క్రితం గుంటూరు ఎక్సైజ్–2 టౌన్ సీఐ ఎం. యశోధర దేవి, ఆమె సిబ్బంది బృందావన్ గార్డెన్స్ సమీపంలోని వేంకటేశ్వర స్వామి గుడి రోడ్డులో తనిఖీ చేస్తుండగా ఇద్దరు ద్విచక్ర వాహనాన్ని ఆపి నిలబడి ఉన్నారు. అనుమానం వచ్చిన ఎక్సైజ్ అధికారులు వారిని ప్రశ్నించారు. ఇద్దరూ తడబడుతుండడంతో వారిని తనిఖీ చేశారు. ఇద్దరి వద్ద 2.52 గ్రాముల మత్తు మందును స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఎక్కడ కొనుగోలు చేస్తున్నారని ప్రశ్నించగా సాయి కృష్ణ వద్ద కొన్నామని తెలిపారు. సాయి కృష్ణ నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌కి వెళ్లి విచారించగా అతని వద్ద 8.15 గ్రాముల మత్తు మందుతోపాటు, ఏడుగురు విద్యార్థులు, ఒక కేజీ గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లు లభించాయి. ఈ కేసులో మొత్తం 11 మంది నిందితులు ఉండగా 9 మందిని అరెస్ట్ చేసి కోర్టు హాజరు పరిచినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. ఈ కేసులో ఇంకా గంజాయి సరఫరా చేస్తున్న సాయి కృష్ణ బంధువు వేంపాటి చైతన్యతో పాటు బెంగళూరుకు చెందిన నితిన్‌ను అరెస్ట్ చేయాల్సి ఉంది. వీరు పరారీలో ఉన్నట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

#### బెంగళూరులో గ్రాము రూ.1400 కొని..

ఎండీఎంఏ మత్తుమందును బెంగళూరులో గ్రాము రూ.1400 కొని ఇక్కడికి తీసుకొచ్చి ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.4 వేల నుంచి రూ.ఐదువేలకు అమ్ముతున్నట్టు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. గుంటూరు సమీపంలోని ప్రధానంగా రెండు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ఈ మత్తు మందును సాయి కృష్ణ అలవాటు చేసినట్లు తెలుస్తోంది. గోరంట్లలోని తన ఫ్లాట్‌లోకి విద్యార్థులను పిలిపించి మత్తు మందు, గంజాయి అమ్ముతున్నట్టు సమాచారం. నాలుగేళ్లుగా ఈ దందాను యథేచ్ఛగా సాగిస్తున్న సాయికృష్ణ తన గ్రామానికి చెందిన సమీప బంధువుతో ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించి విద్యార్థులకు విక్రయిస్తున్నట్టు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ యశోధర దేవిని ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. సీఐతో పాటు ఎస్ఐలు సత్యనారాయణ, మాధవి, హెడ్ కానిస్టేబుల్స్ హనుమంతురావు, సీహెచ్ రాజు, మైలా శ్రీనివాసరావు, రవిబాబు, టీఎస్ఎన్‌రాజు, పి నాగేశ్వరరావు, ఎం సూర్యనారాయణ, వివి చారి, చిన్న బాబు తదితరులనూ అభినందించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ రవి కుమార్ రెడ్డి, గుంటూరు ఎక్సైజ్ శాఖ అధికారి వి అరుణ కుమారి, ఏ ఈ ఎస్ ఈడే మారయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు చైన్‌స్నాచర్లు అరెస్టు

**బంగారం, నగదు స్వాధీనం**

**నరసరావుపేట రూరల్:** జిల్లాలోని పలుచోట్ల చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టుచేసి వారి వద్ద నుంచి రూ.5 లక్షలు విలువైన బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ పి.రామకృష్ణ వెల్లడించారు. మంగళవారం రూరల్ పోలీసుస్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పట్టుకున్న నిందితులతో హాజరై వివరాలను వెల్లడించారు. యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేటకు చెందిన పోతురాజు బాలకృష్ణ, యద్దల నరేంద్రసాయిలను అరెస్టు చేశామన్నారు. వీరు పగలు ద్విచక్ర వాహనంపై తిరుగుతూ బయట, ఇళ్లల్లో ఒంటరిగా ఉండే మహిళలను లక్ష్యంగా చేసుకొని వారి మెడల్లోని బంగారు గొలుసులను లాక్కొని ఉడాయిస్తుంటారన్నారు. గతేడాది సెప్టెంబరు 15న నరసరావుపేట మండలం కాకాని గ్రామంలో సాయంత్రం సమయంలో ఊరిచివర గంగమ్మ దేవాలయం వద్ద సిమెంట్‌బల్లపై కూర్చోని ఉన్న దేవిశెట్టి లక్ష్మమ్మ మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని వాహనంపై వేగంగా పారిపోయారన్నారు. పెదకూరపాడు, ముప్పాళ్ల మండలం తొండపి, రొంపిచర్ల మండలం పరగటిచర్ల గ్రామాల్లో కూడా ఒంటరి మహిళలపై దాడులు చేసి బంగారు గొలుసులను లాక్కొని పరారయ్యారన్నారు. ఈ నేరాలపై దేవిశెట్టి లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఆర్‌కేటీ బైపాస్ వద్ద ఇరువురిని అరెస్టుచేసి బంగారం, నగదు స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు.

### 27న ఉద్యోగులు సాధారణ సెలవు వినియోగించుకోవచ్చు

**లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్):** ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈనెల 27న జరగనున్న నేపథ్యంలో ఆ రోజు ప్రభుత్వ ఉద్యోగులు సాధారణ సెలవు వినియోగించుకోవచ్చని జిల్లా సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌ఓ షేక్.ఖాజావలి మంగళవారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ప్రైవేటు ఉద్యోగులకు యాజమాన్యాలు అనుమతి వ్వాలని సూచించారు.

### ప్రకృతి సేద్య ఖరీఫ్ కార్యాచరణపై అవగాహన కల్పించండి



**లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్):** ప్రకృతి సేద్యం చేస్తున్న గ్రామ సంఘాల్లోని రైతులకు ఖరీఫ్ కార్యాచరణపై అవగాహన నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ చెప్పారు. కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశపు హాలులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన అధికారులతో మాట్లాడారు. ఖరీఫ్ కార్యాచరణ అమలుకు వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, డీఆర్డీఏ శాఖలు ఏపీసీఎన్ఎఫ్ సిబ్బందితో కలిసి సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ప్రగతి, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ గురించి వివరించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీంద్ర బాబు, డీఆర్‌డీఏ పీడీ విజయ లక్ష్మి, జిల్లా పశు సంవర్ధక అధికారి నరసింహారావు మాట్లాడుతూ కార్యాచరణ విజయవంతానికి కృషి చేస్తామన్నారు. రైతులు వట్టిచెరుకూరు ధనుంజయ రావు, అత్తోట బాపయ్య, ఎరుకులపూడి విజయలక్ష్మి ప్రకృతి వ్యవసాయంలో తమ అనుభవాలను పంచుకున్నారు.

### ఇఫ్కో కొత్త ఎరువు మార్కెట్‌లోకి విడుదల



**కొరిటెపాడు(గుంటూరు):** ఇఫ్కో వారు నూతనంగా తయారు చేసిన 28:28:0 అనే కాంప్లెక్స్ ఎరువును జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు మంగళవారం గుంటూరు రూరల్ మండలం, రెడ్డిపాలెం గూడ్స్‌షెడ్ వద్ద మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 28:28:0 ఇఫ్కో వారు తెప్పించడం ఆనందంగా ఉందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ఎరువుల విభాగం ఏడీఏ కేజేడీ రాజన్, గుంటూరు ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, డీసీఎంఎస్ జిల్లా బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం, కొల్లిపర ఏఓ వెంకట్రావు, ఇఫ్కో జిల్లా మేనేజర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా.. శిడిబండి సంబరం



అమ్మవారి ఆలయం ఎదురుగా శిడి ఆడిస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్లో) శిడిబుట్టలో కూర్చుని వేడుక జరిపిస్తున్న పెళ్లి కుమారుడు మౌర్యకిరణ్

**ఉత్సవానికి పోటెత్తిన భక్తజనం**

**ఉయ్యూరు:** అశేష భక్తజన కోలాహలం.. సన్నాయి మేళాల జోరు, డప్పు వాయిద్యాల హోరు.. జై వీరమ్మ.. జైజై వీరమ్మ భక్తజన నినాదాల నడుమ.. శిడిబండి ఊరేగింపు కనుల పండువగా సాగింది. పెళ్లి కుమారుడు ఉయ్యూరు మౌర్యకిరణ్ శిడిబుట్టలో కూర్చున్న ఉత్సవాన్ని భక్తులు కనులారా వీక్షించి తరించారు. పారుపూడి, నెరుసు వంశస్తులు మూడుసార్లు శిడి ఆడించటంతో ఉత్సవం ముగిసింది.

#### నయనానందకరంగా..

ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్లలో 11వ రోజు నిర్వహించే ప్రధాన ఘట్టమైన శిడిబండి వేడుక మంగళవారం నయనానందకరంగా సాగింది. పాత వాటర్ ట్యాంకు రోడ్డులో ప్రత్యేకంగా తయారుచేసిన శిడిబండికి స్థానికులు పసుపునీళ్లు ఓరబోసి గుమ్మడికాయలు కట్టి, కొబ్బరికాయలు కొట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఊరేగింపుగా బయలుదేరిన శిడిబండికి దారిపొడవునా భక్తులు పువ్వులు విసురుతూ పసుపునీళ్లు ఓరబోస్తూ హారతులు పట్టారు. పూలదండలు, గుమ్మడికాయలను శిడిబండికి కట్టి భక్తిపారవశ్యం చెందారు. కాలేజ్ రోడ్డు, ప్రధాన రహదారి వెంబడి సాగిన ఊరేగింపులో అశేష భక్తజనం పాల్గొని తన్మయత్వం చెందారు.

#### శిడిబుట్టలో కూర్చున్న పెళ్లి కుమారుడు..

సంప్రదాయం ప్రకారం ఉయ్యూరు దళితవాడ నుంచి పెళ్లి కుమారుడు ఉయ్యూరు మౌర్య కిరణ్ ఊరేగింపుగా ఆలయం వద్దకు తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు మౌర్య కిరణ్‌ను శిడి బుట్టలో కూర్చోబెట్టి ఆలయ ప్రదక్షిణ చేయించారు. అమ్మవారి ఆలయానికి ఎదురుగా శిడిబండిని నిలిపి మూడుసార్లు శిడి ఆడించటంతో ఉత్సవం ముగిసింది. శిడి ఆడే సమయంలో భక్తులు అరటికాయలు విసురుతూ భక్తిపారవశ్యం చెందారు. వేడుక అనంతరం పెళ్లి కుమారుడితో పాటు ఉయ్యూరు వంశస్తులు, బంధువులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో 300 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

# గుడారాల పండుగకు ఏర్పాట్లు



భక్తులకు పందిళ్లు వేస్తున్న దృశ్యం

**అమరావతి:** హోసన్న మందిరం ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహించే గుడారాల పండుగను ఈ ఏడాది గుంటూరు శివారులోని గోరంట్ల గ్రామంలో కాకుండా మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో నిర్వహించాలని హోసన్న మందిరం పెద్దలు నిర్ణయించారని పాస్టర్ అనీల్ తెలిపారు. మంగళవారం ఆయన ఏర్పాట్ల గురించి వివరిస్తూ హోసన్న మందిరం వ్యవస్థాపకులు హోసన్న మొదటి చర్చి లేమల్లె గ్రామంలో నిర్మాణం చేసినందు వల్ల ఈ పవిత్ర ప్రదేశంలో 18వ గుడారాల పండుగ నిర్వహించాలని నిర్ణయించామన్నారు.

మార్చి 6వ తేదీ సాయంత్రం నుంచి 9వ తేదీ మధ్యాహ్నం వరకు గుడారాల పండుగ నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఇచ్చే లక్షలాది మంది హోసన్నా విశ్వాసులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుమారు వెయ్యికి పైగా మరుగుదొడ్లు, వచ్చిన విశ్వాసులందరికీ భోజన వసతి, పార్కింగ్‌తో పాటుగా వైద్య సౌకర్యాలు కల్పిస్తామన్నారు. సుమారుగా పదివేల మంది వలంటీర్లు పనిచేస్తారని అలాగే పోలీసు శాఖ వారి సహకారం తీసుకుంటామన్నారు.

గుంటూరు, విజయవాడ, సత్తెనపల్లి నుంచి గుడారాల పండుగ వేదిక వద్దకు ప్రత్యేక బస్సులు ఆర్టీసీ వారు నడుపుతారన్నారు. అనకాపల్లి నుండి భీమవరం మీదగా ఆ గుడారాల పండుగకు ప్రత్యేక రైతులు విశ్వాసులు తరలివస్తారన్నారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచే కాక ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు లక్షలాది మంది ఈ పండుగకు తరలి వస్తాన్నారు. ప్రార్థన వేదిక, ప్రార్థన మందిరాలను పరిశుభ్రంగా ఉంచటానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. హోసన్నా మందిరంకు సుమారు 20 ఎకరాల భూమి ఉండగా మిగిలినది రైతుల నుంచి సుమారు వంద ఎకరాలు లీజుకు తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గుడారాల పండుగకు వచ్చు వీఐపీలకు, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేశామన్నారు.

# కేంద్ర పథకాల అమలు తీరుపై ఆరా

**శానంపూడిలో పర్యటించిన కేంద్రం బృందం**



శానంపూడిలో కేంద్రం టీం సభ్యులు



ఉపాధి పనులు పరిశీలిస్తున్న అధికారులు

**శావల్యాపురం:** మండలంలోని శానంపూడి గ్రామంలో కేంద్ర టీం సభ్యులు పర్యటించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పొందుతున్న లబ్ధిదారులను మంగళవారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామసచివాలయంలో ఏర్పాటు చేసిన సదస్సులో న్యూఢిల్లీ సంబోధ రీసెర్చ్ కమ్యూనికేషన్స్ ఫీల్డ్ మేనేజరు అండ్ కోఆర్డినేటరు వికాస్ మల్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రధానమంత్రి ఆవాస్ యోజన, స్వయ సహాయక సంఘాలు, పింఛన్లు పంపిణీ, గ్రామీణ సడక్ యోజన, గ్రామ స్వరాజ్య అభియాన్ తదితర పథకాల పురోగతిపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. పథకాల నిర్వహణలో ఏమైనా ఇబ్బందులున్నాయా, అర్హులకు అందుతున్నాయా తదితరవన్నీ క్షేత్రస్థాయిలో లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం గ్రామంలో పర్యటించి ఆవాస్ యోజన పథకంలో నిర్మించిన నివాస గృహాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి బిల్లులు గురించి ఆరా తీశారు.

ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామంలో పర్యటించి పథకాల వారీగా లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఆయనతో పాటు సర్పంచ్ మొనపాటి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, కేంద్ర టీం సభ్యులు వి.సంధ్యారాణి, లక్ష్మి, లోకేష్, జి.సంధ్యా, భానుచంద్ర, హౌసింగ్ డీఈ ఎన్.శ్రీనివాసరావు, ఏఈ రసూల్, పంచాయతీ కార్యదర్శి బాల పరమేశ్వర రావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

**శావల్యాపురంలో...**

**శావల్యాపురం:** ఉపాధి పనులు పారదర్శకంగా జరిగేలా అధికారులు బాధ్యత వహించాలని న్యూఢిల్లీ కేంద్ర సంబోధ రీసెర్చ్ కమ్యూనికేషన్స్ అధికారి వికాస్ మల్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని శానంపూడి గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వికాస్ మల్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ఉపాధి పనులు పేదలందరు సద్వినియోగం చేసుకొని మంచి ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. కూలీలు చేస్తున్న పంట కాల్వ పనులను, మస్టర్‌ను పరిశీలించి ఉపాధి అధికారులకు తగు సూచనలు చేశారు. ఆయనతో పాటు ఏపీవో కె.రామారావు, డీఎఫ్‌టీ లావణ్య, ఫీల్డ్ అసిస్టెంట్ రాజశేఖర్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# విద్యుత్ తీగలు తగిలి రైతుకు తీవ్రగాయాలు



గాయపడిన సుబ్బారావు

**ఈపూరు(శావల్యాపురం):** మండలంలోని బొమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన రైతు చీదా సుబ్బారావు తాను సాగు చేసిన కంది పంటకి కాపలాగా వెళ్ళి పంట పొలాల రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగలి అపస్మారక స్థితిలోకి వెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఎస్సై ఎం.ఉమామహేశ్వర రావు కథనం ప్రకారం .. చీదా సుబ్బారావుకు చెందిన కంది పొలం భద్రుపాలెం–ముప్పాళ్ళ గ్రామాల మధ్య ఉంది. అయితే అడవి జంతువుల నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు విద్యుత్ తీగలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే గమనించని చీదా సుబ్బారావు బహిర్భూమికి వెళ్ళగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగలి సంఘటన స్థలంలో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కొంత సమయం గడిచిన తర్వాత స్పృహలోకి వచ్చి పడుతూ లేస్తూ వెళ్ళగా ఆ చుట్టుపక్కల పొలంలో ఉన్న రైతు ఆంజనేయులు గమనించి జరిగిన సంఘటన గురించి సెల్‌ఫోను ద్వారా సమాచారాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. సుబ్బారావుకు విద్యుత్‌తీగలు తగిలి తలకు, కాలికి శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వినుకొండ వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యసేవలు నిమిత్తం గుంటూరు తరలించారని ఎస్సై తెలిపారు. క్షతగాత్రుడిని సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమామహేశ్వరరావు తెలిపారు.

# రెంటచింతలలో దొంగలు హల్‌చల్

- రెండు ఇళ్లల్లో చోరీ
- బంగారం, నగదు అపహరణ



సాంబశివరావు ఇంట్లోని చోరీ ఇలా..

**రెంటచింతల:** మండల కేంద్రమైన రెంటచింతలలో సోమవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. పలు ప్రాంతాల్లోని రెండు ఇళ్లల్లో తాళాలు పగలుగొట్టి చోరీలకు పాల్పడ్డారు. గ్రామంలోని ఆరోగ్యనాథుని మందిరం వద్దనున్న ఆదూరి ఇన్నారెడ్డి నాలుగు రోజుల కిందట వెళంగిని కి వెళ్లగా ఆయన భార్య రజని కొంతకాలంగా గుంటూరులోని మనవరాళ్ల వద్దకు వెళ్లి ఉంటోంది. మంగళవారం సాయంత్రం 3 గంటల సమయంలో ఇన్నారెడ్డి విత్తనాల షాపులో పనిచేసే సాగర్ వచ్చి చూడగా ఇంటికి వేసిన తాళాన్ని గ్యాస్ కట్టర్‌తో కోసి ఇంట్లోని బీరువాను, ఇనుపపెట్టెను పగలగొట్టి వస్తువులను చెల్లాచెదురుగా పడవేసిన విషయాన్ని ఇన్నారెడ్డికి తెలిపారు. బీరువా, ఇనుప పెట్టెలో దాచిన 75 గ్రాములు బంగారు వస్తువులు, రూ.70 వేల నగదు అపహరణకు గురైనట్లు ఇన్నారెడ్డి పోలీసులకు వివరించారు. వెండి కిరీటాలు, చిన్నచిన్న వెండి వస్తువులను దొంగలు అక్కడే వదిలి వెళ్లినట్లు తెలిపారు.

అలాగే స్థానిక రామాలయం వద్ద ఉంటున్న తాళ్ళూరి సాంబశివరావు భార్యతో కలిసి ఈ నెల 14న హైదరాబాద్‌లోని కుమారుడి వద్దకు వెళ్లి మంగళవారం ఉదయం తిరిగి వచ్చారు. అయితే ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో బీరువాను తెరిచి దానిలో నున్న రూ.1 లక్ష నగదుతో పాటు రెండు బంగారు చెవి దిద్దులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాలను ఎస్ఐ సీహెచ్ నాగార్జున సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రెండు, మూడు రోజుల పాటు ఇల్లు విడిచి పొరుగు గ్రామానికి వెళ్లే సమయంలో స్థానిక పోలీసు స్టేషన్‌లో తెలియ చేయాలని తెలిపారు.

# కేంద్రం రైల్వే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి ఎం.వి.ప్రసాద్

**లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్):** రైల్వే శాఖ అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉద్యోగుల సమస్యలను తక్షణమే కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శి ఎస్.మంజునాథ్, ఎం.వి ప్రసాద్ డిమాండ్ చేశారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లోని యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన నిరాహార దీక్ష శిబిరంలో వారు మాట్లాడుతూ రైల్వే ఉద్యోగుల సమస్యలను వివరించారు. అనంతరం రైల్వే ఉద్యోగులు నినాదాలతో హోరెత్తించారు. కేంద్రం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ డివిజన్ ట్రెజరర్ ఎస్.జి.కృష్ణయ్య, ఏడీఎస్ కె.కోటేశ్వరరావు, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ట్రెజరర్ సాంబశివరావు, ఏడీఎస్‌లు కరుణశ్రీ, హక్, లావణ్య, సంఘ నాయకులు వెంకటేష్, సాయి కృష్ణ, కిరణ్, ప్రశాంత్, మూర్తి, టి.వి.రావు, సునీల్‌కుమార్, ఉద్యోగ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.